# కళాహృదయం

'తన భార్యది గొప్ప కళాహృదయం' అన్న విషయం నందగోపాల్‌కు పెళ్ళికి ముందు బాగానే ఉండింది గానీ, పెళ్ళయిన తర్వాత చేసే పనులకు విసుగు పుట్టుకొచ్చింది.

పెళ్ళి చూపులప్పుడు కూడా ఆమె ముఖం కన్నా ఎక్కువగా ఆమె చేతుల్లో తయారైన వస్తువులనే చూడాల్సి వచ్చిందతనికి. అయితే మక్కువగానే చూశాడు వాటిని. ఆమె మేనత్తలు, పిన్నమ్మలు, అమ్మ, తమ్ముడు, చెల్లి అందరూ కలసి కట్టుగా ఆమె నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

ఆమె మేనత్త జానకమ్మ ద్వారానికి వేలాడుతున్న పూసల తోరణాన్ని చూపిస్తూ, "దీన్ని మా మాలతే అల్లింది" అని చెప్పింది.

ఆమె పిన్నమ్మ వనజాక్షి కర్టెన్ పైనున్న జోడు చిలుకల బొమ్మను చూపెడుతూ, "దీన్ని కూడా మా అమ్ములే అల్లింది" అని చెప్పింది. అంతేకాదు టీ.వి. పైనున్న వైర్‌తో అల్లిన జంట ఫ్లవర్ వాజ్‌లను చూపెట్టి, అవి కూడా మాలతి చేతుల్లో రూపుదిద్దుకున్నవని చెప్పింది.

మాలతి చెల్లెలు అఖిల లోపలి నుంచి నాలుగైదు లాంగ్ పేజీస్ బౌండు నోట్‌బుక్స్ తెచ్చి, పేజీ పేజీ తిప్పి వాటిలో వేసిన రకరకాల ముగ్గులను చూపెట్టి, "వీటన్నింటినీ మా అక్కే వేసిందని" చెప్పింది. అంతేకాదు, "పండుగ నెలలో తెల్లవారు జామునే లేచి ఆ పేజీలలోని ముగ్గులను వీధి వాకిట్లో వేసి రంగులతో రంగవల్లుల తీర్చిదిద్దుతుందని" చెప్పింది. ఆ మాటకు నందగోపాల్ మది ఆనందంతో పులకరించింది.

**బి. శ్రీప్రసాద్**

ఆ వస్తువులను, ముగ్గుల పుస్తకాలను పరిశీలిస్తూ మధ్యమధ్య తలవంచుకు కూర్చుని ఉన్న మాలతి వంక క్రీగంట చూసి మురిసిపోయాడు.

మాలతి అక్క జలజ, "తన మూడేళ్ళ కూతురు వాణి వేసుకొని వున్న ఫ్రాక్ మాలతే కుట్టిందని" చెప్పింది. అంతటితో ఆగక తను కట్టుకొని వున్న శారీపై వేసిన పెయింట్ వర్క్ చూపెట్టి, కళ్ళెగరేసి, "ఎలా ఉంది?" అని అడిగింది.

ఆమె ప్రశ్నలోని భావాన్ని కనిపెట్టి, "ఇదీ మాలతి వేసిందేనా?" అని అడిగాడు నందగోపాల్ మొహం వెయ్యి వోల్టుల బల్బులా వెలిగిపోతుండగా.

అవునని తల ఊపుతూ, "ఈ పమిట కొసనున్న పట్టుదారాల లేస్‌వర్క్ కూడా తనే చేసింది" అంటూ ఆ లేస్ వర్క్‌ను చూపెట్టింది.

నిజంగా అద్భుతంగా అనిపించింది నందగోపాల్‌కు ఆ లేస్ వర్క్.

ఇంతలో మాలతి తమ్ముడు పదేళ్ళ బబ్లూగాడు వచ్చాడు.

"సమయానికి వచ్చావురా బబ్లూ, లోపలి కెళ్ళి నీకు జేబుపై పువ్వు కుట్టిందే ఆ చొక్కా వేసుకు రారా" అంది జలజ, తమ్ముడితో.

"నేను వేసుకురాను. ఆ చొక్కా వేసుకుంటే



ఆ ఫ్రెండ్స్ అందరూ నవ్వుతున్నారు" విసుక్కున్నాడు బబ్లూ.

మాలతి చివ్వున తలెత్తి, తమ్ముడి వంక కోపంగా చూసింది.

"అది కాదురా బబ్లూ వాళ్ళకు అలాంటి పువ్వు కుట్టిన చొక్కాలు లేవని అసూయ" అనునయంగా అంది జలజ.

"మీరెన్నయినా చెప్పండి ఆ చొక్కా నేను చస్తే వేసుకోను" మూర్ఖంగా అన్నాడు వాడు.

"పోనీ వేసుకోవద్దులే. ఓసారి ఆ చొక్కా యిలా తెచ్చివ్వు" అంది వాళ్ళమ్మ.

తల్లి మాటలకు ఎదురు చెప్పలేక ఆ చొక్కా తెచ్చి అక్క చేతిలో ఉంచి వెలుపలకు తుర్రుమన్నాడు వాడు.

జలజ ఆ చొక్కా జేబుపై కుట్టిన పువ్వు బొమ్మను నందగోపాల్‌కు చూపెట్టి, "బాగుంది కదూ!" అంది.

అవునన్నట్లు తలాడించాడు నందగోపాల్.

అతనితో పాటూ ఆ వస్తువులన్నింటినీ శ్రద్ధగా చూస్తున్నారు అతని తల్లిదండ్రులు.

"ఆహాఁ! నాకు కాబోయే భార్య యింత పనిమంతురాలా? ఇంత విద్య చేతిలో ఉన్నది కనుక అన్నీ తనే చేసుకుంటుంది. తను ఇలాంటి వర్క్‌ల కోసం డబ్బు ఖర్చు పెట్టక్కర లేదు. అంతే కాదు పుట్టే బిడ్డలకు కూడా తనే బట్టలూ అవీ కుట్టుకోగలదు." అని సంతోషపడ్డాడు నందగోపాల్. "పోతేపోయింది కట్నంలో ఓ పదివేలు డిస్కౌంటు కూడా యిచ్చేద్దాం" అనుకున్నాడు కూడా.

ఆ మాటా మెల్లగా తల్లి చెవిలో ఊదాడు.

ఆమె ఏమీ అనలేదు. ఎవరికీ కనిపించకుండా గట్టిగా తొడగిల్లింది. ఆ గిల్లుడుకు గట్టిగా అరవాలనిపించినా అరవలేక పోయాడు నందగోపాల్. కళ్ళ నిండా నీళ్ళు మాత్రం ఆటోమాటిగా ఊరాయి.

మనసులోనే "ఉస్" అనుకొని. తొడ రుద్దుకున్నాడు.

అంతలో కాఫీలు, టిఫిన్లు వచ్చాయి.

ప్లేటులోని మైసూర్ పాక్‌లు చూపి, "ఇవి మాలతే చేసిందని" చెప్పాడు మాలతి తండ్రి ఉమామహేశ్వరరావు.

మనసులోనే లొట్టలు వేసుకున్నాడు నందగోపాల్.

"కారప్పూస కరకర లాడుతూ మహా రుచిగా ఉంది.

'అద్భుతం' అనుకున్నాడు నందగోపాల్. 'ఓహూఁ... నాక్కాబోయే భార్య వంట కూడా చక్కగా చేయగలదు.'

పిల్లా బాగుంది. పిల్ల పనితనమూ బాగుంది.

అతనికే కాదు, అతని తల్లిదండ్రులకు కూడా మాలతి బాగా నచ్చింది. కట్నకానుకలు కూడా బాగానే ముట్టజెప్పారు.

దాంతో మాలతి, నందగోపాల్‌ల పెళ్ళి ఘనంగా జరిగిపోయింది.

★ ★ ★

కాపురానికి వచ్చిన కొత్తల్లో ఓ సాయంత్రం నందగోపాల్ ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి మాలతి హాల్లో ఉయ్యాల బల్ల మీద కనిపించింది. ఆమె చేతిలో వూలు దారం, రెండు సన్నటి, పొడవాటి వూలు అల్లే నీడిల్స్.

"ఏమిటోయ్ అల్లుతున్నావ్?" అడిగాడు నందగోపాల్.

"స్వెటర్ అండీ" ముద్దు ముద్దుగా బదు

లిచ్చింది మాలతి.

"ఎవరికో?"

"మరెవరికీ... మీకే నండీ"

ఆ మాటతో నందగోపాల్‌కు సంతోషం కట్టలు దాటింది. మారు మాట్లాడకుండా బెడ్ రూం లోనికి వెళ్ళి డ్రస్ చేంజ్ చేసుకొని వచ్చాడు. బాత్‌రూంలోనికి వెళ్ళి ముఖం కడుగుకొని వచ్చాడు. మాలతి యింకా ఉయ్యాల బల్లపై నుంచి లేవలేదు. స్వెటర్ అల్లే పనిలో నిమగ్నమై ఉంది.

నందగోపాల్ మాలతి ఎదురుగా సోఫాలో కూలబడి టవల్‌తో ముఖం తుడుచుకొంటూ, "కాఫీ యిస్తావా?" అని అడిగాడు.

"అయ్యో! స్వెటర్ అల్లే పనిలో ఆ మాటే మరిచానండి. మంచి మూడ్‌లో అల్లుతున్నాను. మధ్యలో వదిలానంటే మళ్ళీతాక బుద్ధికాదు. ప్లీజండీ... ఈ పూటకు మీరే కాసిన్ని కాఫీ కలిపి, మీరు తాగి నాకూ ఓ కప్పు యివ్వండి" గోముగా అడిగింది మాలతి.

భార్యలా బతిమిలాడే సరికి అతనికి తప్పింది కాదు.

అతను ఉద్యోగరీత్యా పట్నంలో ఉంటున్నాడు. అతని తల్లిదండ్రులు ఉన్న నాలుగెకరాలు పొలం చూసుకొంటూ తమ ఊర్లోనే ఉంటున్నారు. పొలం అమ్మేసి తన దగ్గరకు వచ్చేయమన్నా మాట వినరు. 'పట్నం వాతావరణం తమకు సరిపడదని' చేప్పేశారు. తమ ఒంటో శక్తి ఉన్నంత కాలం ఆ పొలం పనులు చూసుకుంటూ పల్లెలోనే గడిపేస్తారట.

పెళ్ళికి ముందు ఒంటరిగా ఉన్నప్పుడు స్వయం పాకం అలవాటైంది. ఆ అనుభవం యిప్పుడు ఉపయోగపడింది.

"మీరు నాకన్నా బాగా కాఫీ కలపుతారండి" అని మెచ్చుకుంది మాలతి.

పొంగిపోయాడు. ఆమె మాత్రం ఉయ్యాల బల్ల దిగలేదు. భార్య మూడ్ చెడగొట్టడం యిష్టం లేక ఆ పూట వంట కార్యక్రమం కూడా అతనే కానిచ్చేశాడు.

ఆమెకు స్వెటర్ అల్లేపని ఆ రోజుతో అయిపోలేదు. దాదాపు యిరవై రోజుల పైనే పట్టింది. వరుసగా మూడు స్వెటర్‌లు అల్లిందామె. ఒకటి భర్త కోసం, తక్కినవి అత్తమామల కోసం అల్లిందామె.

స్వెటర్‌ల అల్లకం పూర్తయే వరకు సాయంత్రం వంట డ్యూటీ అతనికి పడింది.

స్వెటర్‌ల అల్లకం పూర్తయిన తరువాత ఓ ఆదివారం భర్తతోపాటు వాళ్ళ ఊరెళ్ళి, అత్తమామలకు తాను అల్లిన స్వెటర్‌లు యిచ్చింది. కోడలు స్వయంగా తమ కోసం అల్లి తెచ్చిన ఆ స్వెటర్‌లు చూసి మురిసిపోయారు ఆ ముసలి దంపతులు.

ఊలు ఖర్చు ఆరేడు వందలయింది. ఖర్చుతో పాటు నందగోపాల్‌కు స్వెటర్‌ల అల్లకం పూర్తయినంత కాలం ఒక పూట వంట డ్యూటీ కూడా పడింది. అయినా క్రెడిట్ అంతా మాలతి కొట్టేసింది.

వంట డ్యూటీ ఉన్నన్ని రోజులూ మనసులోనే విసుక్కొనేవాడు నందగోపాల్.

★ ★ ★

ఓ జీతాల రోజు నందగోపాల్ ఉత్సాహంగా యింటికి వచ్చాడు. ఆ రోజు భార్యతో కలిసి సరదాగా సినిమాకు వెళ్ళాలన్నది అతని కోరిక. అందునా అది అతని అభిమాన హీరో నటించిన సినిమా. రిలీజయి రెండు వారాలయినా భార్యతో కలసి చూడాలని పోస్ట్‌పోన్ చేసుకొంటూ వస్తున్నాడు.

ఇంటికి రాగానే గబగబ స్నానం చేసి, ఇస్త్రీ బట్టలు వేసుకొని రెడీ అయిపోయాడు.

మాలతి, "ఎక్కడికి?" అని అడుగుతుందా అని ఎదురు చూశాడు. ఆమె అదేం అడగలేదు. వేడి వేడి పకోడీలు పెట్టి, కమ్మటి కాఫీ అందించింది.

"త్వరగా రెడీ అవు. సినిమాకు వెళ్దాం" అన్నాడు నందగోపాల్.

"సినిమాకు ఇంకో రోజెప్పుడైనా వెళ్దామండి. ఈ రోజు సరదాగా షాపింగ్‌కు వెళ్దాం. అవసరంగా కొనాల్సిన వస్తువులు కొన్నున్నాయి" అంది మాలతి.

ఆ మాటలకు నందగోపాల్‌కు నిరుత్సాహం వేసినా కాదనలేక పోయాడు. భార్యను నిరుత్సాహ పరచడం అతనికి యిష్టం లేకపోయింది.

ఇద్దరూ చక చక రెడీ అయి షాపింగ్‌కు బయలుదేరారు.

ఆ రోజు ఐదారు వందలు వదిలింది నందగోపాల్‌కు.

భార్య కొన్న వస్తువులను చూసేసరికి అతనికి లోలోపలే ఒళ్ళు మండింది. చేసేదేం లేక నోరు మూసుకొన్నాడు.

ఆ రోజు మాలతి కొన్న వస్తువులు – రంగు దారాలు, పూసలు, చెమ్కీలు, ప్లాస్టిక్ వైర్లు, ఫేబ్రిక్ పెయింట్స్, కుంచెలు వగైరాలు.

ఆ రోజు నుండి వరుసగా పది పదిహేను రోజులు ఓ పూట వంట డ్యూటీ నందగోపాల్‌కిచ్చి, తను క్రియేటివ్ వర్క్‌లో నిమగ్నమయింది మాలతి.

ఆ పదిహేను రోజుల పాటు అంత కష్టపడి ఆమె తయారుచేసిన వస్తువులను చూసేసరికి నందగోపాల్‌కు మరింత ఒళ్ళు మండింది. అవి డైనింగ్ టేబుల్‌పైకి మ్యాట్‌లు, వైర్లతో అల్లిన ఫ్లవర్‌వేజ్‌లు ఇత్యాదులు.

'మార్కెట్‌లో రెడీగా తయారుచేసినవి కొనుంటే అంతకంటే తక్కువ ధరకే వచ్చుండేవి. పదిహేను రోజుల పాటు ఆమెకు శ్రమ, తనకు వంట డ్యూటీ ఉండుండేవి కావు' అనుకొన్నాడు నందగోపాల్.

ఆ మాటే ఆమెతో అనేసరికి ఒంటి కాలిపై గయ్యిమని లేచింది. అతనికి కళను ఆరాధించే మనసు లేదంది. బజారులో దొరికే వస్తువులు తను తయారుచేసిన వాటంత మన్నికైనవి కాదంది. చివరగా భర్తలు ఆఫీసుకు వెళ్ళిన టైంలో స్త్రీలకు ఇలాంటి పనులే కాలక్షేపాన్నియిస్తాయని వాదించింది.

తను భర్త ఆఫీసుకు వెళ్ళిన టైంలో మాత్రమే చేస్తోందా?


ఊహుc...

సాయంత్రాలు కూడా ఈ పనులలో నిమగ్నమయి తనకు వంట డ్యూటీ కూడా ఇస్తోంది. పెళ్ళికి ముందే నయం సాయంత్రాలు అలా సరదాగా బజారుకు షికారుకు వెళ్తుండే వాడు. ఇపుడు వంట వండుతూ గడపాల్సి వస్తోంది.

ఐనా ఆ మాట పైకి అనలేకపోయాడు.

ఎందుకొచ్చిందిలే అని నోరు మూసుకొన్నాడు.

వాళ్ళ పెళ్ళయి ఆరు నెలలే అయినా మాలతి ఆ యింట్లోని చాలా వస్తువులను మార్చేసింది. ఓ నెలలో బెడ్ షీట్లు, పిల్లో కవర్లు మార్చేసి, ప్లెయిన్‌వి కొని వాటిపై ఫేబ్రిక్ పెయింట్స్‌తో రంగు రంగుల డిజైన్లు వేసింది. మరో నెలలో డోర్ కర్టెన్లు, విండో కర్టెన్లు మార్చేసి, మ్యాటీ గుడ్డకొని రంగు దారాలతో




ఎంబ్రాయిడరీ వర్క్ చేసి తగిలించింది. ఇలా ఒక్కొక్కటీ మార్చేయసాగింది.

పోను పోను నందగోపాల్‌కు ఆమె చేసే కళాత్మక వస్తువులంటే విసుగు, విరక్తి కలగ సాగింది.

ఉన్నవి తీసి పారేసి, కొత్తవి తయారుచేసి మరీ తగిలించాల్సి అవసరం ఏమొచ్చింది? డబ్బు దండగ తప్ప!

ఆ మాట ఆమెతో మాత్రం అనలేదు.

అంటే ఆమె నుంచి రియాక్షన్ ఎలా ఉం టుందో అతనికి తెలుసు.

ఆమె వాదన ఎలా ఉంటుందో అతనికి యింకా బాగా తెలుసు.

"నా చుట్టూ ఉండే పరిసరాలన్నీ నాలోని కళకు అద్దం పట్టేట్లుండాలి. కళను – కళాఖం డాలను మెచ్చుకోవాలి. అదే మనిషిలోని నాగరి కతకు నిదర్శనం" అంటుంది.

ఇవన్నీ చేసే బదులు సగంలో వదిలేసిన డిగ్రీని పూర్తి చేయొచ్చు గదా!

ఊహుం! అది మాత్రం లేదు.

ఆమెకు బొత్తిగా చదువు మీద యింటరెస్ట్ లేదు.

"ఇప్పుడు ఆ డిగ్రీ సర్టిఫికేట్ సంపాదించి ఎవరిని ఉద్ధరించాలి?" అంటుంది. "నేనేం ఉద్యో గాలు చేయల్నా? ఊళ్ళేలాల్నా?" అంటుంది.

గట్టిగా వాదిస్తే...

"విడాకులిచ్చేస్తాను. మీరు వేరే ఎవరినైనా కట్టుకోండి. నేను మా పుట్టింటికి వెళ్తాను. మనసు చంపుకు బతకడం నాకు నచ్చని పని" అంటుంది.

ఎంతైనా నందగోపాల్‌కు భార్యంటే ప్రేమె క్కువ.

అందుకే ఆమెకు ఎదురు చెప్పలేక పోయే వాడు.

రాను రాను మాలతిలోని కళాకారిణిని చుట్టు పక్కల వాళ్ళు కూడా గుర్తించ సాగారు. మధ్యాహ్న సమయాలు నందగోపాల్ యింట్లో చేరేవారు. మాలతి తయారుచేసిన వస్తువులను చూసి, ఆమెను తెగ పొగడ్తలతో ముంచెత్తే వారు.

అప్పటికే ఇద్దరు ముగ్గురు ఆంటీలు ఆమెకు శిష్యురాండ్రుగా మారిపోయారు.

ఒక్కోసారి అతను ఆఫీసు నుంచి యింటికి వచ్చేసరికి ఆడంగులు చాలామంది పోగయి ఉంటారు. ఎవరూ అతను వచ్చిన సంగతి గుర్తించనైనా గుర్తించక అల్లికలతో, పెయింట్ వర్కులతో బిజీగా ఉంటారు.

మాలతి సంగతి సరేసరి! ఆమె ఆ మహిళా మణులకు కళా గురువు. వాళ్ళకు సూచనలు, సలహాలు యిస్తూ అతనిని అసలు గుర్తించదు.

ఒక్కోసారి అతనే వారందరికీ కాఫీలు అందించాల్సిన పరిస్థితి వస్తోంది.

నందగోపాల్‌కు ఇల్లు నరకంలా అనిపించేది.

ఆమె అంతటితో ఆగలేదు.

టీ.వీ.లో మధ్యాహ్న సమయాలలో వచ్చే స్త్రీల కార్యక్రమాలు శ్రద్ధగా చూసేది.

చూస్తే ఫరవాలేదు. ఆ కార్యక్రమాలలో చూపెట్టే కళాత్మక వస్తువుల తయారీ విధానం లాంటివి చూసి, వెంటనే వాటిని తయారు చేసేందుకు పూనుకునేది. వాటిని తయారు చేసేందుకు వందల రూపాయలు ఖర్చు చేసేది. ఆమె కదో ఆనందం. అతనికి మాత్రం ఆమె చేసే పనులు సుద్ధ వేస్టు.

పాట్ పెయింటింగ్, పేపర్ కటింగ్ లాంటి వాటి వలన ఏమిటి ఉపయోగం?

అదీ గాక అవసరానికి మించి తయారు చేసిన ఆ వస్తువులను ఎక్కడ పెట్టుకోవాలి?

ఇల్లంతా అప్పటికే ఆమెచే తయారుచేయబడిన కళాఖండాలతో నిండిపోయింది. ఇంట్లో ఏమూల చూసినా అవే.

గుట్టలు గుట్టలుగా పడున్న ఆ వస్తువులను చూస్తుంటే ఏవగింపు పుట్టుకురాసాగింది నందగోపాల్‌కు.

చివరకు బెడ్‌రూంలో బెడ్‌ల కింద రెండు మూడు ప్లాస్టిక్ టబ్స్ నిండా పూసలు, దారాలు, రంగులు, కుంచెలు, వైర్ల లాంటి వాటితో నింపి వుంచింది.

"దేవుడా! దీని పిచ్చి పనులతో వేగలేక చస్తున్నాను స్వామీ. దీనితో ఎలా వేగాలో నువ్వే ఓ దారి చూపెట్టు స్వామీ" అని వేడుకున్నాడు.

★ ★ ★

దేవుడు అతనికి పరబ్రహ్మం రూపంలో వచ్చి మార్గం చూపించాడు.

అయితే అది మాలతి మనసు మార్చే మార్గం కాదు.

అతన్నే పూర్తిగా మార్చేసిన మార్గం.

★ ★ ★


ఒక రోజు ఆఫీసులో తన గోడు తన స్నేహితుడైన పరబ్రహ్మం ముందు వెళ్ళగక్కుకున్నాడు నందగోపాల్.

అంతావిని కిసుక్కున నవ్వాడు పరబ్రహ్మం.

ఆ నవ్వు చూసేసరికి ఒళ్ళు మండింది నందగోపాల్‌కు.

"నా గోడు నీకు నవ్వులాటలాగే ఉంటుంది లేరా. నీతో చెప్పుకోవడం నాదీ బుద్ధి తక్కువ." నిష్ఠూరమాడాడు నందగోపాల్.

"కోప్పడకురా. నీ సమస్యకు నా భార్య దగ్గర




గొప్ప సొల్యూషన్ ఉంది. రేపు ఆదివారం నువ్వు నీ భార్యతో కలిసి మా యింటికి రా. పెళ్ళయిన తర్వాత నువ్వు అసలు మా యింటికి రావడమే మానేశావు. మధ్యాహ్నం భోజనాలు మా ఇంట్లోనే. మా ఆవిడ కూడా మీ ఆవిడను చూడాలంటోంది. అదీ ఇదీ రెండు కలిసొస్తాయి." అన్నాడు పరబ్రహ్మాం.

"మీ ఆవిడను చూస్తే మా ఆవిడ పిచ్చి పనులు చేయడం మానుకుంటుందా?" అడిగాడు నందగోపాల్.

"నువ్వు వాటిని పిచ్చి పనులు అనడం మానేస్తావు" నవ్వాడు పరబ్రహ్మాం.

"నాన్సెన్స్" అన్నాడు నందగోపాల్.

"అదీ చూద్దాంగా" అన్నాడు పరబ్రహ్మాం.

"సరే. రేపు ఆదివారం మీయింటికి వచ్చిన తర్వాత చూద్దాం" అన్నాడు నందగోపాల్.

★ ★ ★

ఆదివారం నందగోపాల్ భార్యతో కలిసి పరబ్రహ్మాం యింటికి వెళ్ళాడు.

పరబ్రహ్మాం దంపతులు వాళ్ళ కోసమే ఎదురు చూస్తున్నట్లుంది. వాళ్ళను చూడగానే వీధిలోకి ఎదురెళ్ళి మరీ స్వాగతం పలికారు.

అప్పటికే వంట కార్యక్రమం పూర్తయినట్లుంది. తీరిగ్గా కూచుని ఉంది పరబ్రహ్మాం భార్య సుశీల.

కాఫీలయ్యాక పిచ్చాపాటీ మాటల్లో పడ్డారంతా.

మాలతి వాళ్ళ యింటిని పరిశీలనగా చూడ్డం గమనించిన సుశీల, "రామ్మా, ఇల్లు చూద్దువుగానీ" అంది.

అంతా లేచారు.

పరబ్రహ్మాం యింట్లోని వాతావరణం చూసేసరికి మతిపోయినంత పనైంది నందగోపాల్‌కు. తమ ఇంటి కన్నా ఎక్కువ కళాత్మకంగా ఉంది పరబ్రహ్మాం యిల్లు.

డోర్ కర్టెన్లు, విండో కర్టెన్లు కొత్తగా ఉన్నా

యి. వాటిపై చేసిన ఎంబ్రాయిడరీ వర్క్ అద్భుతంగా ఉంది. ఫ్రిజ్‌పైన, టీపాయ్‌పైన, కార్నర్ స్టాండులపై నున్న ఫ్లవర్‌వేజ్‌లు, డిజైన్డ్ పాట్‌లు ఆకర్షణీయంగా ఉన్నాయి. డైనింగ్ టేబుల్ మీదనున్న మేట్‌లు కొత్త రకంగా ఉన్నాయి. గోడల మీదనున్న వాల్ హేంగింగ్స్ కళాత్మకంగా ఉన్నాయి.

అవి చాలవన్నట్టు ఓ గదిలో ఇలాంటి కళాత్మక వస్తువులను స్టోర్ చేసి పెట్టుకొంది.

అవన్నీ చూచేసరికి నందగోపాల్‌కు దడ పుట్టింది.

"పరబ్రహ్మంగాడింటికి రావడం బుద్ధి తక్కువైంది. ఇవన్నీ చూసిన మాలతి ఊరుకోదు. తనూ ఇవన్నీ చేయాలని కూర్చుంటుంది. తన జేబుకు చిలుం వదలడమే గాక ఓ నెల నాళ్ళు రాత్రి వంట తన నెత్తిన పడడం ఖాయం" అనుకున్నాడు.

వాటన్నిటినీ ఎంతో ఆసక్తిగా గమనించిన మాలతి, సుశీలను అడిగింది, "వీటిని అన్నింటినీ మీరే తయారు చేశారా?" అని.

"అబ్బే! నాకంత నేర్పులేదమ్మా. అన్నీ కొన్నవే" అందామె.

"ఇవన్నీ కొన్నారా?" ఆశ్చర్యంగా అడిగింది మాలతి.

"అవును."

"మరి ఈ రూంలో స్టోర్ చేసిన వస్తువులను కూడా కొన్నారా?"

"అవును."

"ఇన్ని వస్తువులు కొనడం దేనికండీ?" మరింత ఆశ్చర్యంగా అడిగింది మాలతి.

నందగోపాల్, పరబ్రహ్మం వైపు జాలిగా చూసాడు.

ముందుకు వంగి గుసగుస లాడుతున్నట్లు అన్నాడు. "రోలొచ్చి మద్దెలతో మెరపెట్టుకున్నట్లుగా ఉందిరా నేను నీతో చెప్పుకోవడం" అని మళ్ళీ అన్నాడు. "అయితే ఒకటి నయం! నీకు డబ్బొక్కటే వదిలింది. వంట డ్యూటీ లేదు" అని.


పరబ్రహ్మం నవ్వాడు.

"తొందరపడకు. మా ఆవిడ చెప్పేది విను" అన్నాడు.

"నాకిలాంటి వస్తువులంటే తగని ప్రీతి మాలతీ. అయితే తయారు చేయగల ఓర్పు -నేర్పు నాకు లేవు. నీలా నేర్పుగా తయారు చేయగల వాళ్ళ దగ్గర నుండి యిలాంటి వస్తువులను కొంటుంటాను. నాలాగా ఇలాంటి వస్తువులను అభిమానించే వాళ్ళు ఈ నగరంలో చాలా మందే ఉన్నారు. అలాంటి వాళ్ళకు వీటిని కాస్త లాభం వేసుకొని అమ్ముతుంటాను. ఇటు మానసిక సంతృప్తి - అటు స్వల్ప ఆదాయం. ఈ కాలంలో ఏదో ఒక పని చేసి ఇద్దరూ సంపాదిస్తేనే కదా! సంసారం సజావుగా నడిచేది. నాలుగు రూపాయలు వెనుకేసుకోకపోతే రేపు పిల్లాజెల్లా కలిగాక - వాళ్ళ చదువులకు, పెళ్ళిళ్ళకు డబ్బెక్కడి నుంచి తీసుకు రాగలం?అందుకు నాకు నచ్చిన ఈ వస్తువులనే డబ్బు సంపాదనకు మార్గంగా ఎంచుకున్నాను" అంది సుశీల.

"మీ దగ్గర వీటిని కొనేదెవరు?" అడిగింది మాలతి.

"చాలామంది ఉన్నారు. నాకు నగరంలోని అనేక మహిళా మండళ్ళ వాళ్ళు తెలుసు. అప్పుడప్పుడూ మహిళా మండళ్ళ మీటింగ్‌లు జరుగుతుంటాయి. అలాంటి అప్పుడు చాలామంది మహిళలు వస్తుంటారు. అలాంటి సందర్భాలలో వీటిని అమ్ముతుంటాను. నేనే అప్పు




దప్పుడు ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి అమ్ము తుంటాను"

అది విన్న నందగోపాల్ ఆశ్చర్యపోయాడు.

"ఆ విషయాలు తీరిగ్గా తరవాత మాట్లాడు కోవచ్చు. ముందు భోజనాలు చేద్దాం పదండి." అన్నాడు పరబ్రహ్మం.

అందరూ కదిలారు.

సాయంత్రం మాలతి, నందగోపాల్‌లు బయలుదేరబోతూంటే అడిగింది సుశీల.

"మాలతీ! త్వరలో నేనో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయబోతున్నాను. రేపు మీ యింటికి వస్తాను. మీరు తయారుచేసిన వస్తువులేమన్నా ఉంటే సిద్ధంగా ఉంచండి. తగిన డబ్బిచ్చి నేనే కొనుగోలు చేస్తాను. అంతేకాదు నేను ఆర్డర్స్ యిస్తుంటాను. నేను కోరినవి నాకు చేసిస్తుండాలి. సరేనా?"

"సరే" అంది మాలతి.

★ ★ ★

మరుసటి రోజు అన్నట్లుగానే మాలతి వద్దకు వచ్చింది సుశీల. మాలతి సిద్ధంగా ఉంచిన వస్తువులన్నింటినీ పరిశీలించింది. వాటన్నిటికీ టోకుగా ఓ ధర కట్టి పదివేలు మాలతి చేతిలో ఉంచింది.

అంత డబ్బు చూసి మనసులోనే ఆనందాశ్చర్యాలకు గురైంది మాలతి.

"వీటన్నింటి మీదా ఎంతలేదన్నా నాకు రెండు మూడు వేల వరకూ లాభం ఉంటుంది" అంది సుశీల.

"నాకు యింకొంచెం పెచ్చుగానే లాభం వచ్చింది" అనుకొంది మాలతి.

★ ★ ★

ఆ తర్వాత నందగోపాల్ ఎప్పుడూ మాలతి పనులను చూసి 'పిచ్చిపనులు' అనుకోలేదు. మరింత ప్రోత్సహించాడు.

మరి అతనికి ఆమె ద్వారా నెలకు ఐదారు వేలు ఆదాయం వస్తోంది కదా! ●